# బంతిపువ్వు

**బా**రెడు పొద్దెక్కింది. ఎండపొడ బంగారి తీగల తీర్గ కండ్లకు గొడతంది. దూరంగ ఇప్పసెట్టుకింద గొర్రెంకలు కవ్వర కవ్వర మంటన్నయి. మోటబాయికాడి ఏపసెట్టు తోసక దానండ్లదే గులుక్కుంటంది.... మిరపతోట్ల రాయేశడు బురద సేతులతోని పిక్కలు గీక్కొని పీజకట్టదెంపి నడ్డిరిసి నిలుసున్నడు... పీజలకు నీల్లు బొలబొల బోతన్నయి. జమిలిమోటల్ల ఏదో ఒక మోట గీరె పదం మరిసిపోయి రాగం తీసినట్టుగ కిర్రుకిర్రుమంటుంది... మోటగొడ్తన్న కైతీకాల ఎల్లుగాడు కొండపొడుగు రాగందీసి నక్కోరడి గక్కినట్టు పదం బాడ్తుండు.

నడ్డిరిసి నిలుసున్న రాయేశానికి బంతిసెట్ల సందునుంచి సెలుకు సెలుకున నీల్లు దన్నుకుంట చిందొర్సాని తార రావడం గనిపిచ్చింది.... గాడి మొఖం బంతి పువ్వయి పోయింది. కార్తన్న సీమిడి ఎగపీల్చిండు. మోసేతుల దనుక అంటిన బురద కడుక్కున్నడు.

"ఓర్రాయేశ- ఏడ సచ్చినవుర" తార పిలిచింది.

"ఇగో గీన్నే ఉన్న...." రాయేశడు.

"నాకు బంతిపూలు దెంపిబెట్టవా?" తార రాయేశానికి కూసంత దూరాన కాలువలనే నిలుసుండి అడిగింది.

"మాతెంపిపెడ్త దొరసాని... కని రొండుమోటల నీల్లాయె. కూసంత సేపాగుతె మోటలిడుత్తరు- నా నీల్లు గట్టుడు ఖలాసయిపోద్ది. గప్పుడు నువ్వు మోసే అన్ని బంతిపూలు దెంపిపెడ్త..."

"ఆఁ నాకేం పనిలేదనుకున్నావా...?"

"అబ్బో కొద్దిపనా! నీ బాంచెనాతె". రాయేశడు కిసుక్కున నవ్విండు...

"తలకు బోసుకోవాలె- బంతిపూల దండ గుచ్చుకోవాలె. మా అమ్మకు దండ గుచ్చరాదు. అదిగాక బంతిపూలు తలల పెట్టుకోవద్దంటది."

"అదెనట..." రాయేశడు కాలువ మొదటికురికి తెంపిండు...

"మట్టి మొఖమా? బంతిపూలకు ఆసనుంటదా?"

"ఆసనలేపోతేంది?"

"నీ జుట్టు..." తార ఎక్కిరిచ్చింది.

"నా జుట్టుకో ఉనుక బంతిపువ్వు గట్టుకోవాలె..."

తార పకపక నవ్వింది... రాయేశడు పార సేతుల బట్టుకొని పొంగిపోయిండు...

"నువ్వు తెంపియ్యకుంటె... మానె నేను తెంపుకుంట... మతికుంచుకో, చెక్కర బెట్టమంటె నీ వీపు...." తార కసపిస పూలు కోసుకోబట్టింది....

"రిక్కబంతులు కోత్తన్నవు... ఉనుక బంతులు బాగుంటయి..." అంటూ రాయేశడు పీజకట్ట తెంపుకుంటన్నడు–

"నాతో మాట్లాడ్తే సెప్పుతోని గొడ్త..." తార.

"శాత్రలు చెప్పుమన్నవా? ఓ దొర్సాని నిన్న ఎడ్లకాడ కంచెల్ల ఏం శాత్రం నీ బాంచెనాతె..." రాయేశడు ఊరిచ్చిండు.

తార నిటారుగా నిలుసుండి రాయేశాన్ని సూసింది– సీమిడి ముక్కు– ఎండల కమిలిన అన్నంలేని ఒళ్లు– నీల్లసుట్టు ఉరుకులు పరుగులు బెడ్తండు–

"దొర్సాని కాలువల నిలుసుంటే నీల్లు పోటుగమ్మి కాలువ తెగిపోద్ది – నీ బాంచెన్ జెర గడ్డకుండి తెంపుకోండ్లి–"

"మరి నాకు నిన్నటి శాత్రం జెప్పుతావా?"

"గిప్పుడే అద్దంటివి గదా!"

"చెప్పుమంటన్న గద–"

"సరే మా చెప్పుతా–"

తార కాలువ ఒడ్డుమీదికెక్కింది.... తెంపిన రిక్కబంతి పూవొకటి విచ్చి నీల్లల్ల పోసింది. బంతి రెక్కలు నీల్లమీన పడవలతీర్క తేలిపోతన్నయి...

"రాయేశ కంచెల్ల కుందేల్లుంటయి గదా!" తార ఏదో గుర్తు తెచ్చుకుంటడిగింది.

"ఓ నా బాంచెనాతె కంచెల్ల కుందేల్లేం కర్మ– పూరేల్లుంటయి – అడవి కోల్లుంటయి. బొల్లి కోల్లుంటయి... బలుసుపండ్లు, తవిసి గడ్డలు– ఆనకాలంలైతే తునికి పలుకులుంటయి– నువ్వెప్పుడన్న తునికి పలుకులు సూసినవా దొర్సాని?..."

"ఎక్కడ నువ్వెప్పుడు తేలేదు? మంచిగ నా దగ్గరైతే ఏదుంటె ఆదోడిచ్చుక తింటవు...."

"అవ్వతోడు గీసారి ఆనకాలంల తెత్త. మెతుకుల తీరుగుంటయి. జినకల మందచ్చినప్పుడు సూడాలె–"

"రాయేశం నన్ను కంచెలకు తీసుకుపోతవా?"

తార రాయేశని పక్కకు మిరుప తోట్లకు నడిసి అడిగింది.

"మా తీసుకుపోదు గని... నువ్వు దొర్సానివైతివి...."

"అయితేంది?...."

"అబ్బో మీ బాపుకు తెలిత్తే నన్ను సంపేత్తడు–"

"ఛీ! నువ్వు దొంగవు– ఏదడిగినా ఏదో అడ్డం చెప్పుతవు–" తార గునిసింది.

"నేనేమి సెయ్యాలె దొర్సాని- అయ్యయ్యో! నీ లంగకు బురదంటుతంది" రాయేశదు తార మీగాళ్లమీద లంగ ఎత్తిపట్టుకున్నాడు.

"అంటనియ్యి పాడులంగ- ఉరుకుదామంటే కాల్లకు చుట్టుకుంటది. గోచీ పెట్టుకుంటే అమ్మ 'మాదిగిముండని' తిడ్తది"... తార రాయేశని చేతుల్లో నుండి లంగ కుచ్చెళ్లు గుంజుకొని బొడ్లె చెక్కుకున్నది. రాయేశదు నున్నగా మెరుత్తన్న తార కాళ్లు సూసుకుంట నిలుసున్నడు. పీజ నిండిపోయింది.

"రాయేశా నీల్లు నిండినయ్...." తార... రాయేశదు ఉలిక్కిపడి దబదబ కట్ట తెంపిండు... తన పాదాలు సూసుకున్నడు. మడిమెలు పగిలి నెత్తురెల్తంది- కుడికాలు సీలెమండమీద పుండు- గీరుకపోయి అంతెట్లనో ఉన్నయనుకున్నడు-

"శాత్రం సెప్పుతనంటివి-" తార

"ఓ్రాయేశో! నీల్లుగడ్తన్నవా! ఆగం చేత్తన్నవురో? బిడ్డా రొండు పలుకలు బారాలె..." మోటకాడి నుంచి ఎల్లుగాడు కేక బెట్టిండు....

"మాకడ్తన్ననే...." రాయేశదు అర్సి కేక బెట్టిండు...

"శాత్రం జెప్పుతవా? పొమ్మంటవా?" తార బెదిరిచ్చింది.

"మా సెప్పుత దొర్సాని... కని అగో నీకాళ్లకంత బురదంటింది... దొరచ్చే యాల్లయ్యింది- నా వీపు మెతుపుతడు...."

"శాత్రం జెప్పకుంటె నీల్లల్ల దబెల్లున కూలబడ్త... మా బాపుతోని రాయేశదు బడేసిండని సెప్పుత...."

రాయేశదు గజగజ అనికిపోయిండు. కండ్లల్ల బయం తొంగిసూసింది...

"ఎనుకట ఓ రాజట- రాజంటే రాజు గాదు మా దండిరాజు..."

"ఓ స్పోసు రాజుల కథా? శాత్రమంటె నేను ఏ కుందేలుదో అనుకున్న.... మా అక్కయ్య సదుకునే పుస్తకంలో రాజుల కతలు సానున్నయి, కావాలంటే పట్టు వదలని విక్రమార్కుని కథ నేనే చెప్పుత."

"ఎట్లెట్ల పొట్టి లాలయ్య ఇక్రమార్కుడేనా? ఈడు అలగా" రాయేశదు ఇచ్చెంతర పడి అడిగిండు.

"ఒక్కడే విక్రమార్కుడుంటాడా ఏమిటి?" తార.

"సరే- గిది రాజు కథైనా ఇనాలె మా బాగుంటుంది. ఎందుకంటె గిందట్ల ఇంకో శాత్రమున్నది."

"అయితే సెప్పు"

"రాజుకు సంతానం లేక మొక్కరాని దేవుల్లకల్ల మొక్కిండంట. నోమరాని నోములన్ని నోముకున్నడట- ఆఖరుకు ఎములాడ రాయన్నకు మొక్కినంక-"

"గప్పుడు కూడా ఎములాడ రాయన్న ఉన్నడని సెప్పిండా?"

"అడ్డంరాకు దొర్సాని-అడ్డమత్తె మరి మర్చిపోత- ఆఖరుకు ఓ బిడ్డ బుట్టిందట- లేకలేక బుట్టిందిగన్క 'లోకవ్వ'ని పేరు పెట్టిండ్లట. లోకవ్వ- దినమొక్క శాయ పున్నమి సెంద్రుని తీర్గ పెరిగిపోయి పెండ్లి కెదిగిందట- రాజుకు ఒక్కతే బిడ్డ గన్క ఏ రాజకుమారున్నన్న ఇల్లుటం దెచ్చుకొని సగం రాజ్జెం రాసిత్తననుకొని లోకవ్వను బిలిసి అడిగిండంట- గప్పుడు లోకవ్వన్నదట! బాపూ నువ్వు కన్నవు పెంచినవు- ఇజ్జె బుద్ధులు జెప్పిచ్చినవు, మంచి మాట- కని నా పెండ్లికి నెనో మాట జెప్పుత" అన్నదట-

"సెప్పు బిడ్డా" అన్నడట రాజు-

"బాపు! దాని మొదలు ఇనుప మొదలు- దాని పూత బంగారి పూత- దాని కాత ఎండి కాత- ఎండికాయల బొట్టు దీస్కచ్చిన పిలగాన్నే పెండ్లాడత"నన్నదట-

"ఏందేంది?" తార.

"మంచిగిను దాని మొదలు ఇనుప మొదలు. దాని పూత బంగారి పూత. దాని కాత ఎండి కాత- ఎండికాయల బొట్టు...."

తార ఆ మాటను మల్ల మల్లన్నది....

"రాజు మంతురుల బిలిపిచ్చి లోకవ్వ జెప్పిన మాట మంతురులకు జెప్పిండట- మంతురులు తలలు గోక్కున్నరట- రాజ్జెంల గీముచ్చట దండోరేపిచ్చిండ్లంట..."

"ఏ రాజకుమారుడన్న తెచ్చిండంటవ..." తార....

"గిట్లమజ్జెన అడ్డమత్తెట్ల?" రాయేశడు మిడిగుడ్లు తిప్పుకుంట రాజకుమారుని తీర్గ మిరుప చెట్లల్ల నిలుసున్నడు- నీల్లు ఎలుకతోక దొడ్డత్తన్నయి- బంతి సెట్లకాడ కాలువ తెగిపోయి ఇదివరకు కట్టిన పీజెలన్ని నీల్లునిండి పుట్ట పుట్ట తెగిపోయి తార కాళ్లకిందికి నీల్లచ్చినయి- రాయేశడు తేలుగుట్టినోని తీర్గ ఎగిరి "సత్తి దొర్సాని" అని పారందుకొని కాలువపొంట ఉరికిండు.

తారకు నీల్లన్ని ఎటుబడితే అటు ఉరుకుడు సూసి మతిబోయింది. ఇద్దరు గలసి మొత్తానికి తెగిపోయిన కాలువ కట్టేసిండ్లు. కట్టేసి రాయేశడు తారను సూసిండు- తార సేతులనిండ బురద- పట్టులంగంత బురద.

"సంపుతివి దొర్సాని- నా తోలు ఒలిసేత్తది పెద్దొర్సాని." రాయేశని కండ్లల్ల నీల్లు నిలిచినయ్.

"బంతిపూలు తెంపంగ నేనే జారిపడ్డనంట..." తార సేతుల కంటిన బురద కడుక్కుంట అన్నది....

రాయేశడు మల్ల మిరపతోట్ల జొచ్చిండు....

"ఏమాయె ఆఖరుకేమయ్యింది సెప్పు" తార అడిగింది.

రాయేశడు సిత్రంగా తారను సూసి "ఏవున్నది- ఏడేడు పద్నాలుగు రాజ్యాల రాజకుమారులు ధంగయి పోయిండ్లు-"

"లోకవ్వకు పెండ్లి గాలేదంటవా? మా పెద్దక్క తీర్గనే..." తార....

"పెద్దొర్సానికి పెండ్లి గావన్నంటె మదండి పైకము గావన్నట- మా పాలేరోల్లు గట్లనుకుంటరు..."

"మా బాపు గట్లనే అంటరు- పైకమెందుకో?"

"కట్నమియ్యద్దా?"

"నాకేమద్దు.... నేను లోకవ్వ తీర్గనే షెరతుబెడ్త..." తార...

"గీంత ఇనవూ... ఏడ తిర్గినా ఇనుప మొదలు సెట్టు గన్పియ్యలేదట- ఆఖరుకు ఓ గొడ్ల పోరడు రాజు కొలువు దీరుండగ కొలువుల కచ్చిండట- "ఓ రాజా మీ బిడ్డ చెప్పిన బొట్టు దెచ్చినన్నడట."

"కొలువుల మనుషులు ఒకల మొఖాలొకలు సూసుకున్నరట. రాజు గొడ్లపోరన్ని బొట్టు సూపెట్టుమన్నడట. గప్పుడు గొడ్లపోరడు "మా సూపెడతగని మీ బిడ్డను- 'పుట్టు గొడ్రాలు గాదు- పుట్టిన పోరగాండ్లకు పానం లేదు- పుట్టినోల్లు ఒక్కల్లు గాదు పన్నెండుమంది- పన్నెండుమందిని పక్కన బెట్టుక ఇరువై ఒక్క దినాలూ అలపోసిన తల్లి... పరమేశ్వరుడు మెచ్చి పన్నెండుమందికి పానంబోత్తె నోట జోగాలబాడి- కాలితోటి పాలిచ్చిండట- అగోగ తల్లికూర అందుకరమ్మను'... అన్నడట".

రాజుకు సల్ల సెముటలు బెట్టి గీముచ్చట బిడ్డకు చెప్పిండట. లోకవ్వ- "నాయిన్న నువు రంధి పడకుమని చెప్పి ఆ పిలగాన్ని లోగింట్లకు బిలువుమన్నదట-"

గొడ్ల పోరడచ్చెటాల్లకు లోకవ్వ అంటచేసి తయినతుగున్నదట.

"ఏంపిలడా! బొట్టు దెచ్చినవా?" లోకవ్వ అడిగిండట-

"మా తెచ్చినగని కూరండినవా?" పిల్లగాడడిగిండంట.

"లేలే భోజనానికి లెమ్మన్నదట" లోకవ్వ.

గొడ్ల పిలగాడు భోజనానికి లేసిండట- ఆడ కోడికూర జూసి- "సెబ్బాస్ రాని ఇగో నీ బొట్టు...." అని తుమ్మకాయ అగరుబొట్టు దీసిచ్చిండట...

"రాజు గొడ్లపోరనికి బిడ్డనిచ్చి పెండ్లి సేసి సగం రాజ్జెం రాసిచ్చిండట..."

"ఎటెట్లా..." తార.

"ఎట్లేంది- దాని మొదలు ఇనుప మొదలు- తుమ్మసెట్టు మొదలెట్లుంటది? దాని పూత బంగారి పూత- తుమ్మపూత- దానికాత ఎండికాత- తుమ్మకాయ తెల్లగుంటది గద. గ కాయల నుంచి అగరెల్లుతది- గదే బొట్టు..."

"మరి పిల్లల తల్లి కూరో... కోడికూర గాయింత తెల్వదా?" రాయేశడు పకపక నవ్విండు.

"నేను గిట్ట గసొంటి షరతు బెడ్తె నువ్వే నన్ను పెండ్లాడెటట్టున్నది." తార ఇసారంల బడి ఉనుక బంతి పువ్వొకటి తెంపుకొని సేతుల బట్టుకున్నది.

రాయేశడు బొచ్చిరిసి నిట్ట నిలువుగ నిలుసున్నడు. పెండ్లి కొడుకుతీర్గ.

"నేనా దొర్సాని...!" ఇంకేదో సెప్పాల్నని రాయేశడు నోరు తెరిసిండు...

"లంజకొడుక... నీల్లగట్ట దోల్తె గిదా నువు జేసేపని" ఈపుమీన ఒక్క సరుపు- రాయేశడు ముక్కు మూసుకుని బురదల బొక్కబోర్ల పడ్డడు.... పెయ్యంత మన్నే... మట్టిల నుంచే మీదకు సూసిండు- మిరుపు సెట్లల్ల తెల్లటి బట్టల దొర- గజగజ అనుక్కుంట తార నిలుసున్నది.

దొర తన్నటానికి కాలెత్తిండు- కాలు గాలిలనే ఉన్నది. దొర మల్లెపువ్వు సొంటి బట్టలమీద బురద సిల్లింది... తెరిసిన నోట్లో మట్టిబడ్డది... కండ్లమీద మట్టిపొర- కండ్లు దెరిసేటాల్లకేమున్నది? రాయేశడు మట్టి మనిషికి పానమచ్చి ఉరికినట్టుగా పురుకుతండు... రాయేశని కాల్లు దాకి ఎర్రటి మిరుపకాయలు రాలుతున్నాయి.

అనుకోకుండా తార సేతులున్న ఉనుక బంతిపువ్వు జారి నీల్లల్ల బడ్డది... అది నీల్లమీన తేలిపోతంది...

❄

ఆనందజ్యోతి వారపత్రిక 07-06-1980